1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

గురువారం ఆగస్టు 29, 2024 www.navatelangana.com

విద్యుత్‌షాక్‌తో చిరుత మృతి



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల కంచెకు తగిలి చిరుత మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని హాజీపూర్ తాండకు చెందిన గిరిజన రైతు తన పొలంలోని చెరుకు పంట చుట్టూ అడవి పందుల బెడద నివారణకు విద్యుత్ తీగల కంచె ఏర్పాటు చేశారు. అయితే ఈ తీగలకు తగిలి ఇటీవల చిరుత మృతి చెందగా గమనించిన రైతు విషయం బయటకు తెలియకుండా గొయ్యితవ్వి అందులో పాతిపెట్టారు. ఈ విషయం ఎల్లారెడ్డి అడవీశాఖ అధికారులకు తెలియడంతో బుధవారం హుటాహుటిన సిబ్బందితో వెళ్లి పాతిపెట్టిన చిరుత కళేబరాన్ని వెలికి తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. దుప్య అనే రైతుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓంకార్ తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఆందోళనతో

వాహిని స్కూల్‌ను సందర్శించిన ఎంఈవో

నవతెలంగాణ-కామారెడ్డిడెస్క్(జుక్కల్)



జుక్కల్ మండలంలోని పెద్ద గుల్లలోని వేద వాహిని ప్రైవేట్ పాఠశాలను ఎంఈవో రాములు నాయక్ బుధవారం తనిఖీ చేశారు. సదరు ప్రయివేటు స్కూలు నిబంధనలు పాటించడం లేదని, భవన నిర్మాణానికి అనుమతులు సైతం లేవని ఎస్ఎఫ్ఐ ఆందోళన చేపట్టి ఫిర్యాదు చేయడంతో ఎంఈవో తనిఖీ చేశారు. పాఠశాల భవన నిర్మాణం చేసే ముందు అనుమతులు తీసుకోలేదని, మౌలిక సదుపాయాలైన మారుగుదొడ్లు, మంచి నీటి సదుపాయం లేదని ఈ విషయాలు డీఈవోకు నివేదించనున్నట్లు తెలిపారు.

పరిధి మించి వైద్యం చేయొద్దు

- ప్రథమ చికిత్సకే పరిమితమవ్వాలి
- నవతెలంగాణ కథనం ఎఫెక్ట్..
- ఆర్ఎంపీ, పీఎంపీ క్లీనిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన వైద్యాధికారులు





రామారెడ్డిలో వైద్యాధికారి తనిఖీకి వెళ్లిన సమయంలో ఓ రోగికి గ్లూకోజ్ పెట్టిన ఆర్ఎంపీ.. లింగంపేట్‌లో సూచనలిస్తున్న వైద్యాధికారి

నవతెలంగాణ-రామారెడ్డి/లింగంపేట్



ఆర్ఎంపీ, పీఎంపీ కేంద్రాలు కేవలం ప్రథమ చికిత్సకే పరిమితం కావాలని, అంతకుమించిన వైద్యం చేయొద్దని వైద్యాధికారులు సూచించారు. పరిధి దాటి చికిత్సలు అందజేసి ప్రజల ప్రాణాలు తీయొద్దని అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పీఎంపీ, ఆర్ఎంపీల చికిత్సతో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వారం వ్యవధిలో నలుగురు మృత్యు వాత పడటంపై 'రోగమొకటి.. వైద్యం మరోటి' శీర్షికతో నవతెలంగాణలో ప్రచురించిన కథనంపై వైద్యశాఖ స్పందించింది. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వైద్యాధికారులతో పాటు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్‌లు తమ పరిధిలోని ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను బుధవారం తనిఖీ చేశారు. పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

రామారెడ్డి : మండల కేంద్రంలో బుధవారం ఆర్ఎంపీలు, పి ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలను రామారెడ్డి పి హెచ్ సి వైద్యులు సురేష్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. పి ఎంపీలు, ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స సేవలు మాత్రమే నిర్వహించాలని, యాంటీ బయాటిక్, గ్లూకోస్‌లను పెట్టి చికిత్స నిర్వహించవద్దని సూచించారు. ఎవరైనా పరిధి దాటి చికిత్స నిర్వహిస్తే నోటీసులు ఇచ్చి, క్లినిక్ ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నేటి నుండి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జార్జ్ పాల్గొన్నారు.

అన్నారం పీహెచ్‌సీ పరిధిలో

ఆర్ఎంపీలు, పి ఎమ్ పీ లు గ్రామాల్లో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఎలాంటి యాంటీబయాటిక్, సెలూన్‌లను రోగులకు అందించొద్దని అన్నారం పిహెచ్సి వైద్యురాలు మానస సూచించారు. బుధవారం పలు క్లినిక్‌లను తనిఖీ చేశారు. రోగులకు జ్వరం, రోగం ప్రమాదంగా మారేవరకు పి ఎంపీలు ఆర్ ఎంపీలు, సెలూన్లు పెట్టి చికిత్స నిర్వహిస్తున్నారని, ఇలాంటిది రోగులకు హానికరమని, ప్రభుత్వ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రథమ చికిత్సలకే పరిమితం కావాలి

లింగంపేట్ : సీజనల్ జ్వరాలకు చికిత్సలు చేయరాదని మండల వైద్యాధికారి డాక్టర్ హిమబిందు పీఎంపీలకు, ఆర్ఎంపీలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు క్లినిక్‌లను తనిఖీ చేశారు. ప్రథమ చికిత్సలకే పరిమితం కావాలని ఆమె సూచించారు. రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు. వారికి ఏమేమీ చికిత్సలు చేస్తున్నారో వివరాల అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎంపీలు పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, సీజనల్ వ్యాధులు సోకినవారు ఉన్నట్లయితే వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి పంపించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రథమ చికిత్స ఆలయాల్లో ఆర్ఎంపీలు పీఎంపీలు ఇష్టానుసారంగా రోగులకు వైద్య చికిత్సలు చేయవద్దన్నారు. అలాంటి వారిపై ఫిర్యాదు వస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో సూచించినప్పటికీ తీరుమారడం లేదని అన్నారు. గ్లూకోస్ బాటిల్ పెట్టే అధికారం సైతం లేదన్నారు. రోగుల నుండి ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లితో పాటు ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీలు ఎంపీడీవో నరేష్ ఎంపీఓ మలహరి వైద్య సిబ్బంది ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న రైతు సంఘం నాయకులు

అర్హులందరికీ రైతు రుణమాఫీ చేయాలి

- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు చేసేటప్పుడు లేని నిబంధనలు రుణమాఫీలో విధించడం వల్ల 70 శాతం రైతులు రుణమాఫీ పొందలేని పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ తెలిపారు. షరతులు లేకుండా 2 లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా బుధవారం నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఎస్ కిరణ్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని తెలిపారు. రేషన్ కార్డు నిబంధనలు తొలగించి, పహాణి నకలు ఆధారంగా రుణం తీసుకుని రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. రుణమాఫీ కాక రైతులు బ్యాంకుల, సొసైటీల వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. అసైన్డ్ భూములకు కూడా రైతు రుణమాఫీ, రైతుబంధు రూ.7,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రుణమాఫీ అయిన రైతులందరికీ కొత్తగా మళ్లీ రుణాలు మంజూరు చేసే విధంగా బ్యాంకులకి, సొసైటీలకి సూచనలు చేయాలని షరతులు లేకుండా రైతులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్, జిల్లా కమిటీ సభ్యులు దేవనూరు రాజన్న, జి.లక్ష్మి, రామ్ సింగ్, మురళి కృష్ణ, వడ్డెన్న, రవి, గంగాధర్, పుష్ప శంకర్ నాయక్, మోహన్, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటికోసం రోడ్డెక్కిన మహిళలు



రోడ్డుకు అడ్డంగా ఖాళీ బిందెలు పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నవతెలంగాణ-రామారెడ్డి

గత మూడు నాలుగు రోజుల నుండి తాగునీరు రావట్లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రామారెడ్డి మండల కేంద్రంలోని 2వ వార్డులో మహిళలు బుధవారం రోడ్డు ఎక్కారు. రోడ్డుపై కాలి బిందెలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతం మూడు నాలుగు రోజుల నుండి మిషన్ భగీరథ నీరు రావటం లేదని, గ్రామపంచాయతీ బోరు మోటర్ మూడు రోజుల క్రితం చెడిపోవడంతో, గ్రామపంచాయతీ ప్రత్యామ్నాయ మార్గాలను చేపట్టకపోవడంతో నీటి ఇబ్బంది ఏర్పడిందని వారు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్ ను ఘటనపై వివరణ కోరగా... మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ లతో నీటి సరఫరా అంతరాయం కలిగిందని, గ్రామపంచాయతీ బోరు మోటర్ చెడిపోవడంతో త్రాగునీటికి రెండు రోజులు అంతరాయం కలిగిందని, బుధవారం బోరు మోటారు మరమ్మతు చేసి కాలనీలకు నీరు అందించామని తెలిపారు.

విద్యుత్ పోరాటం, అమరుల స్ఫూర్తి చిరస్మరణీయం

- నేటికీ చార్జీల పెంపుపై ఆలోచించే పరిస్థితి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు



విద్యుత్‌పోరాట అమరవీరులకు నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యుత్ పోరాటం, అమరుల స్ఫూర్తి చిరస్మరణీయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. నాటి విద్యుత్ పోరాట స్ఫూర్తి వల్ల నేటికి విద్యుత్ చార్జీలు పెంచాలంటే పాలకులు ఆలోచించాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ సమావేశం నిర్వహించారు. ముందుగా విద్యుత్ పోరాట అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రపంచ బ్యాంకు విధానాల అమలులో భాగంగా విద్యుత్ ఛార్జీలను పెంచటానికి నిర్ణయించినందున ప్రజలు పెద్ద ఎత్తున చార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ వామ పక్ష పార్టీల ఆధ్వ ర్యంలో పోరా టాలు నిర్వహిం చినట్టు గుర్తు చేశారు. అంతి మంగా 2000 ఆగస్టు 28న చలో హైదరాబాద్ కార్య క్రమం వేలాది మంది ప్రశాంతంగా తమ నిరసనను చేపడుతున్న సందర్భంలో ప్రభుత్వం పోలీసు లను ప్రయోగించి, ఉద్యమాన్ని అణిచివేయడం కోసం చూసిందని తెలిపారు. జలఫిరంగులు, బాష్పవాయి గోళాలను, లాఠీ చార్జీతో పాటు కాల్పులు జరపటం వలన వందలాదిమంది గాయాలపాలయ్యారని, రామకష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి అమరులు అయ్యారని తెలిపారు. వేలాదిమంది పైన కేసులు బనాయించారని, గుర్తు చేశారు. వాటి పోరాట స్ఫూర్తితో ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ బారాలు మోపటానికి వెనకడుగు వేస్తుందని, విద్యుత్తు పోరాట అమరవీరుల స్ఫూర్తి నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉందని ఆయన అన్నారు. పోరాటం ప్రజా సమస్యలపై ఉద్యమాలను ఏరకంగా నిర్వహించాలో నేటికీ బాట చూపిందని తెలిపారు. నాటి విద్యుత్ పోరాటం జిల్లాలో కూడా సీపీఐ(ఎం)తో పాటు వామపక్షాలు వివిధ రూపాల్లో నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విగ్నేష్, నాయకులు సిర్ప లింగం, నల్వాల నరసయ్య, అనసూయమ్మ,, అనిత, ఉద్ధవ్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి



ఇంటింటిసర్వే వివరాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-మద్నూర్

ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల అనుసారంగా ఇంటింటి సర్వేను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జుక్కల్ అసెంబ్లీ నియోజక వర్గంలో ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అదనపు జిల్లా కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ని బిఎల్‌ఓను సర్వే యొక్క తీరును అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని నూత నంగా 18 సంవత్సరాలు చేరిన వారికి ఓటరుగా చేర్చాల ని, దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఆధార్ సేక రించని వారి ఓటర్ గుర్తింపుకు ఆధార్ సీడింగ్ చేయాల ని అన్నారు. మరణించిన వారి ఓటును తొలగించడానికి మరణ ధ్రువ పత్రం జత చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ ఎండి ముజీబ్, మండల ఎంపీడీవో రాణి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, బిఎల్‌ఓ సూపర్వైజర్ రవి కుమార్, బిఎల్‌ఓ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం సందర్శించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



వైద్యాధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

హెడ్ క్వార్టర్స్ మెయింటైన్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కామారెడ్డి మండలంలోని గర్గుల్ పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరంలో గల ఓపి, రక్త పరీక్షల ల్యాబ్, ఫార్మసీ సంబంధించిన వాటిని తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలలో పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు వివరాలపై వాకబు చేసి ప్రస్తుత వర్షాల నేపథ్యంలో ప్రజలపై సీజనల్ వ్యాధులు ప్రభావం అధికంగా చూపుతాయని జ్వర పీడిత సర్వే పగడ్బందీగా నిర్వహించి సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్పి, ఏఎన్ఎం ఆశాలు ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వైద్య సిబ్బంది హెడ్ క్వార్టర్స్ మెయింటైన్ చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

వైజ్ఞానిక దృక్పథం అలవర్చుకోవాలి

వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకొని ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ విద్యార్థులకు ఉద్బోధించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కామారెడ్డి మండలంలోని గర్గుల్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. విద్యార్థుల పాఠ్యాంశాల పై పలు ప్రశ్నలు వేసి, వారి సమాధానాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించి మండలంలోని విద్యార్థులందరు షెడ్యూల్ ప్రకారం వినియోగించుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జడ్పీ సీఈఓ చందర్ నాయక్, డిఆర్డిఓ సురేందర్, ఎంఈఓ ఎల్లయ్య పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

ప్రమాద రహిత జిల్లాగా నిలుపుదాం

- అవగాహన సదస్సులో జిల్లా జడ్జి, కలెక్టర్, సీ.పీ పిలుపు
- హెల్మెట్ ధారణను అలవాటుగా మలుచుకోవాలని హితవు



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్.. ర్యాలీలో జిల్లా జడ్జి, సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ పిలుపునిచ్చారు. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ శాఖ, న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ పరేడ్ మైదానంలో ట్రాఫిక్ నిబంధనలు, ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాల్సిన ఆవశ్యకతపై హైస్కూల్, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరేడ్ గ్రౌండ్ నుండి కోర్టు కాంప్లెక్ చౌరస్తా వరకు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ జరిపారు. జిల్లా జడ్జి, కలెక్టర్, సీ.పీలు సైతం హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాల గురించి పోలీస్ కళాజాత బందం సభ్యులు పాటలు, ప్రదర్శనల ద్వారా అవగాహన కలిపించారు.

ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని, వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరని నష్టం కలిగిస్తున్నారని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు కూడా నేరస్థులుగా పరిగణించబడతారని, చట్ట ప్రకారం మూడేళ్ళ వరకు కారాగార శిక్ష, రూ. 25 వేల వరకు జరిమానా విధించబడుతుందని తెలిపారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, రోడ్డు దుర్ఘటనలలో అత్యధికంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, ఎంతోమంది క్షతగాత్రులుగా మారుతున్నారని అన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే దాదాపు 90 శాతం వరకు ప్రాణాపాయం బారి నుండి తమను తాము కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ సూచించారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించడాన్ని అలవాటుగా చేసుకోవాలని, దీనిని కనీస బాధ్యతగా భావించాలని పిలుపు నిచ్చారు. ఎదుటివారి వల్ల ప్రమాదాలకు గురైన సందర్భాల లోనూ హెల్మెట్ ప్రాణాపాయ స్థితి నుండి కాపాడుతుందని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన వారి బాధిత కుటుంబాలకు ఎంత చేసినా వారికి కలిగే నష్టాన్ని ఎవరూ పూడ్చలేరని, ఈ విషయాన్ని దష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని, నిజామాబాద్ జిల్లాను ప్రమాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కషి చేయాలని సూచించారు.

పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, దేశంలో రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి గంటకు 19 మంది మత్యువాత పడుతున్నారని, నిజామాబాద్ జిల్లాలో గతేడాది 337 మంది, ఈ ఏడాది ఇప్పటికే 218 మంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో ద్విచక్రవాహనదారులు సంఖ్యనే అధికంగా ఉందని గణాంకాలతో సహా వెల్లడించారు. జిల్లాలో మొత్తం వాహనాల సంఖ్య 4,47,923 కాగా, అందులో ద్విచక్ర వాహనాలు 3,70,789 ఉన్నాయని అన్నారు. అత్యధిక మంది హెల్మెట్ ధరించకుండా టూవీలర్స్ నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, వారిలో 55 శాతానికి పైగా యువతనే బాధితులుగా ఉంటున్నారని సీ.పీ ఆవేదన వెలిబుచ్చారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం బారి నుండి తమనుతాము కాపాడుకోవచ్చని హితవు పలికారు. కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జీలు కనకదుర్గా, టి.శ్రీనివాస్, ఆశాలత, సీనియర్ సివిల్ జడ్జీలు ఎం.శ్రీకాంత్ బాబు, పి.పద్మావతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.గోపికష్ణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జీలు ఖుష్బు ఉపాధ్యాయ్, పి.శ్రీనివాస్ రావు, మేజిస్ట్రేట్లు వి.హరికుమార్, చైతన్య, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, ట్రాఫిక్ ఏ.సీ.పీ నారాయణ, ఎంవిఐ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు



అవేర్‌నెస్ కల్పిస్తున్న పలువురు

శానిటేషన్ వర్కర్లకు మాస్కులు అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్


వర్కర్లకు మాస్కులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 1000 మాస్కులను గోల్ హనుమాన్ సర్కిల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మకరంద్ శానిటేషన్ వర్కర్లకు బుధవారం పంపిణీ చేశారు. శానిటేషన్ వర్కర్లకు భద్రత సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని కమిషనర్ తెలిపారు. వారికి కావలిసిన పనిముట్లు సమకూర్చాలని ఆదేశాలిచ్చారు. హెల్త్ క్యాంప్స్ నిర్వహణకు లయన్స్ క్లబ్ సహకారం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ లింగం, మున్సిపల్ అడిషనల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునిల్, జవానులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం రాత్రి సమయంలో వ్యక్తి ఆస్పత్రి ఆవరణలో పడిపోయి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సదరు వ్యక్తి మృతి చెందాడని వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712659837, 871259714 నంబర్లకు సంప్రదించాలని వన్‌టౌన్ ఎహెచ్‌వో విజయ్ బాబు సూచించారు.


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

అమ్మ భాషను మరవద్దు..

- నేడు మాతృభాషా దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

మాతృభాషపై మమకారం కరువవుతుంది. అమ్మ నాన్న అన్న పదాలను మరుస్తూ మమ్మీ, డాడీ అంటూ పిలువడం ఫ్యాషన్‌గా మారింది. పేరుకే తెలుగోళ్ళం కానీ మాట్లాడే భాషలోని పదాలన్నీ పొరుగోళ్ల వయ్యాయి. ప్రస్తుతం తెలుగు మాట్లాడడం. రాయడం, చదవడం, నామోషీగా భావిస్తుండడం మన దౌర్భాగ్యం. మన కవులు, రచయితలు, భాషా పండితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు వెలుగు మసకబారి పోకుండా కొలువుతీరిన రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నేడు(గిడుగు వెంకట రామమూర్తి జయంతి)మాతృభాష దినోత్సవం సందర్భంగా...

పరభాషపై వ్యామోహంతో...

విద్యార్థి తెలుగు భాషలో విద్యనభ్యసించినప్పుడే పరిపూర్ణ మాతృత్వాన్ని సాధిస్తాడు అన్న మహాత్మా గాంధీ సూక్తులు, శిశువుకు తల్లిపాలు ఎలాంటివో విద్యార్థికి మాతృభాషలో బోధన అలాంటిది అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులు చదువుకునేందుకు పరిమితమయ్యాయి. ఇలా ఎందరో మహానుభావులు అమ్మ భాషను కీర్తించారు. భాష ప్రాముఖ్యతను చాటిచెప్పారు. మన తెలుగు భాషను గౌరవించండి.. తెలుగులోనే మాట్లాడండి అంటూ పద సంపదను ఆవిష్కరించారు. అరుదైన గౌరవం తీసుకొచ్చి పట్టం కట్టారు. నేటి కంప్యూటర్ యుగంలో పర భాషపై వ్యామోహంతో తెలుగుకు ప్రాధాన్యత తగ్గుతూ వస్తుంది.

నార్ల వారి నీతి పద్యం..

గుడ్లగూబ పెద్ద గుడ్లు ఉన్నదైనను వెలుగు చూడలేదు. విద్యలు ఉన్న నేమి విజ్ఞత లేకున్నా వాస్తవము నార్ల వారి మాట.. గుడ్లగూబకు పెద్ద కండ్లు ఉంటాయి, కానీ ఏం లాభం వెలుతురు చూడలేదు. ఎంత చదువుకున్న విజ్ఞత లేని వారు గుడ్లగూబతో సమానంజ విజ్ఞత అనేది వెలుతురు వంటిది జ్ఞానం సంస్కారం చదువు నిరర్థకమని నార్ల వెంకటేశ్వరరావు ఈ నీతి పద్యం ద్వారా సందేశం ఇచ్చారు.



ఖండాంతరాల్లోనూ తెలుగు భాష...

దక్షిణాఫ్రికాలోని ఓ పాఠశాలలో తెలుగు బడి బాల వాచకాన్ని అక్కడి తెలుగు విద్యార్థుల కోసం పాఠ్యాంశంగా ఈ సంవత్సరం ఎంపిక చేశారు. తెలంగాణలోని కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు రచయిత కూకట్ల తిరుపతి ఈ తెలుగు బడి బాలవచకాన్ని రచించారు.

ఆధునిక పద్ధతుల్లో శాస్త్రీయ విధానం సాంకేతికతను జోడించి ఈ పుస్తకాన్ని రూపకల్పన చేశారు. అయితే తక్కువ రోజుల్లో సులువుగా తెలుగును చదవడం రాయడం నేర్చుకునేలా పాఠాలు ఉన్నాయి. ఇందులో సరళ, గుణింత, ద్విచక్షర, సంయుక్తాక్షర, సంశ్లేషణక్షర పదాలు పొందుపరిచి తెలిసిన విషయం నుంచి తెలియని విషయం వైపుగా బోధన జరిగేట్లు ప్రణాళిక బద్ధంగా వివరించారు. జాతీయాలు, పొడుపు కథలు, సామెతల వివరాలను పొందుపరిచారు. ఇది తెలుగు సంస్కృతిని చాటేలా ఉండడంతో దక్షిణాఫ్రికా తెలుగు వారు దీనిని తమ పిల్లలకు బోధించేందుకు పాఠ్యాంశంగా ఎంపిక చేసుకున్నారు.

తెలుగు భాషావిభాగంలో...

తెలుగు భాషా విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 23 మంది ఎంపిక కాగా, అందులో జిల్లాలోని జక్రాన్‌పల్లి మండలంలోని వివేక నగర్ తండాకు చెందిన సామాన్య గిరిజన రచయిత రమేష్ కార్తీక్ నాయక్ ఎంపికయ్యారు. గిరిజనుల జీవిత గాథలపై రాసిన తెలుగు కథల సంపుటి డవులో (విషాదగీతం)రచనకు యువ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈయన రాసిన బాల్దేరు బండి పుస్తకాన్ని 2019 లో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. బయల్దేరు బండి అనగా ఎడ్లబండ అని అర్థం బంజారా జీవితాలకు ఎడ్లబండితో అవినాభావ సంబంధం ఉంటుంది.

వలసలు వెళ్లడానికి పొలం నుంచి మేత, వంట చెరుకు తేవడానికి ఎడ్లబండ్లే ఆధారం . మరుగున పడుతున్న గుండు, కోయ, చెంచు, లంబడిలా జీవితాలను ఈ ప్రపంచానికి రమేష్ కార్తీక్ పరిచయం చేయడం కొసమెరుపు.

జిల్లాలో అప్పటి కలెక్టర్..

తెలుగు భాష అమలకు కృషిచేసిన అధికారులు గతంలో జిల్లా నుండి ఎందరో ఉన్నారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన టీవీ రాయుడు తెలుగు భాష అమలులో చిత్తశుద్ధితో వ్యవహరించి మాతృభాషపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల అన్ని భవనాలకు తెలుగులో పేర్లు ఉండాలని కార్యకలాపాలను పూర్తిగా తెలుగులోనే చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. వాటిని అమలు పరిచిన అధికారిగా రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అప్పటి సీనియర్ న్యాయమూర్తి మంగారి రాజేందర్ తెలుగులోనే తీర్పులు చెప్పి సామాన్యుల ప్రశంసలు పొందారు. ప్రభుత్వాలు మారుతున్న తెలుగు భాష అమలు మాత్రం నిస్తేజంగానే సాగుతోంది. ఉన్నతాధికారులు తెలుగును 100శాతం అమలు చేయాలని చెప్తున్న క్షేత్రస్థాయిలో అది కనిపించడం లేదు. అధికారులు ఆదేశించినప్పుడు మాత్రమే మొక్కుబడిగా చేసి తర్వాత మనకెందుకులే అని చేతులు దులుపుకుంటున్నారు. తెలుగు భాష ప్రాధాన్యత ఏటేటా తగ్గిపోతుంది.

> **తెలుగు భాషను ఈఈతరం మరచిపోతుంది**
> **సినీ రచయిత తనికెళ్ల భరణి..**
> ఆంగ్ల భాషపై వ్యామోహంతో అన్ని భాషల్లో కెల్లా గొప్పదైన తెలుగు భాషను ఈ తరం మర్చిపోతుందని ప్రముఖ సినీ రచయిత కవి గాయకుడు తనికెళ్ళ భరణి ఇటీవల ఆర్మూర్ వచ్చినప్పుడు జరిగిన ఒక కార్యక్రమంలో ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు తెలుగు భాషను నేర్చుకునే విధంగా ప్రభుత్వాలు ప్రాముఖ్యతను కల్పించాలని గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమంలో అన్నారు.

నేడు అమ్మ భాషపై ఆలవోకగా పట్టు సాధించి తమ మీద సంపత్తికి మరింత పదును పెడుతూ తెలుగు సాహిత్య సముద్రాన్ని ఈదుతూ విభిన్న రచనలు చేయాలని పరితపిస్తున్న కవులు జిల్లాలో ఎందరో ఉన్నారు. గ్రామ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి వరకు తెలుగు అమలు పక్కగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాతృభాషకు పట్టం కడుతున్న కోకిల నాగరాజు

మండలంలోని అంకాపూర్ స్వగ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయులు కోకిల నాగరాజు ఏ పాఠశాలలో పనిచేసిన విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిర్విరామ కృషి చేస్తున్నారు. గతంలో పనిచేసిన మంతిని పాఠశాలలో ప్రస్తుతం పని చేస్తున్న కోమన్పల్లి పాఠశాల యందు విద్యార్థిని విద్యార్థులకు దేశభక్తి గేయాలు, జానపద గేయాలు, శతకధారణ, అభినయ గేయాలు వీటితోపాటు సొంతంగా రచనలు చేసేందుకు కృషి చేస్తున్నారు. వ్యాస రచనలో జాతీయస్థాయిలో, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో విద్యార్థులు అనేక సాహితీ సంస్థల ప్రశంసలు అందుకునేందుకు మాతృభాష అభ్యున్నతికి కృషి చేస్తున్నారు.

> **తెలుగు విశిష్టతను చాటాలి..**
> **డాక్టర్ అమృత లత, రచయిత్రి, విజయ్ విద్యాసంస్థల అధినేత్రి, ఆర్మూర్.**
> 
> తెలుగు భాష విశిష్టతను చాటేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. అన్ని పాఠశాలల్లో పక్కాగా తెలుగు అమలుకు కృషి చేయాలి. అప్పుడే పిల్లలకు తెలుగుపై మక్కువ పెరుగుతుంది. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అంత్ఃకరణ శుద్ధితో దిశగా కృషి చేయాలి.

> **అమ్మ భాషను మరిచిపోవద్దు..**
> **కోకిల నాగరాజు, తెలుగు భాష ఉపాధ్యాయులు కోమన్‌పల్లి.**
> 
> పరభాష వ్యామోహంతో నేటి విద్యార్థులు తెలుగుకు దూరమవుతున్నారు. తల్లిదండ్రులు కూడా మాతృభాషలో చదివించేందుకు ఇష్టపడాలి. అప్పుడే పిల్లల్లో మానసిక వికాసం వృద్ధి చెందుతుంది. అమ్మ భాషను మరిచిపోవద్దు. విద్యార్థులలో అపారమైన నైపుణ్యం దాగి ఉంటుంది. సాహి త్య పరంగా సాంస్కృతికపరంగా వాళ్లను ప్రోత్సహించి నప్పుడు అద్భుతాలు సృష్టిస్తారు. పద్య రచన శతక ధారణలో కృషి చేస్తూ మా విద్యార్థులు తెలుగు భాషకు మెరుగులు అద్దుతు న్నారు. శతకం వెలువరించే ప్రయత్నం లో ఉన్నాం.తెలుగు లోని అనేక ప్రక్రియలలో విద్యార్థులను తీర్చి దిద్దడం ద్వారా వారికి భాష పై మక్కువ కలుగుతుంది. తెలుగు ను కాపాడుకోవడం

ఇసుక వేలం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సుంకిని దారిలో గల డంపు చేసిన 13 ట్రాక్టర్లు ఇసుకను వేలం వేశారు. వేలంలో సుంకిని గ్రామానికి చెందిన యాదవ్ రావు రూ.8400కు తీసుకున్నారని తహసీల్దార్ జె.మల్లయ్య తెలిపారు.

నేడు రుణమాఫీ కోసం ధర్నా

నవతెలంగాణ-మాక్లూర్

రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ ఏక కాలంలో చేయాలని మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపడుతున్నట్టు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొండ గంగాధర్ బుధవారం తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏక కాలంలో రూ. రెండు లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. పంట రుణ మాఫీ రాని రైతులందరూ కూడా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


30న హెచ్‌సిఎల్ టెక్‌బీలో మెగా ఉద్యోగ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్ 2023 - 2024 పూర్తి చేసుకున్న విద్యార్థులకు హెసీఎల్ టెక్ బీలో ఈ నెల 30న సాఫ్ట్‌వేర్ రంగంలో డిపోట పోస్టు కోసం జిల్లాలోని గిరి రాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ మోహన్ రెడ్డి, డాక్టర్ పి.రామకృష్ణ, టీఎస్ కేసీ కోఆర్డినేటర్, శ్రీకాంత్, టీఎస్ కేసీ మేంటర్, హెచ్ సి ఎల్ సంస్థ ఇంచార్జి రాజుల రాజేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టేక్ వారు నిర్వహిస్తున్న టేక్ బీ ప్రోగ్రాం కోసం సిఈసి, బైపీసీ, వొకేషనల్, హెచ్‌ఈసి గ్రూపులతో 2023, 2024 సంవత్సరంలో పూర్తిచేసి ఉండాలి 75 శాతం మార్కుల తో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఈ నెల 30 న జిల్లాలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ప్రభుత్వ రంగ, ప్రైవేట్ కళాశాలల అభ్యర్థులు తమ పదో తరగతి పాస్ సర్టిఫికెట్ నకలు, ఇంటర్మీడియట్ పాస్ ఆన్లైన్ సర్టిఫికెట్ నకలు, ఆధార్ కార్డు నకలు, ఒక ఫోటో, జిల్లాలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియం నందు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్స్ కు https://bit.ly/HCLTB-Telangana పూర్తి వివరాలకు ఈ ఫోన్ నంబర్‌లకు 8074065803, 9701665424 సంప్రదించాలని తెలిపారు.

షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలి

- తెలుగుదేశం పార్టీ


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ మాజీ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాద గౌడ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. రేవంత్ రెడ్డి ఎన్నికల హామీల్లో ఇచ్చిన రెండు లక్షల రైతు రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన వారికే రుణమాఫీ మళ్ళీ జరిగిందని కొత్తవారికి రుణమాఫీ అవ్వలేదని యాదగౌడ్ అన్నారు. రైతు ఐక్య కార్యాచరణ చేస్తున్న పోరాటానికి తెలుగుదేశం పార్టీ పూర్తి మద్దతిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అంబికా సత్యనారాయణ, అహ్మద్, గోవర్ధన్ గౌడ్, పసుల రాజు, చిలుక సత్యనారాయణ ఇప్పలపల్లి విష్ణు, గంగోలి రాజేశ్వర్, కోటేశ్వరరావు, రాజేష్, రాములు, రవి కుమార్ పాటిల్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దుబాయిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- మృతదేహం స్వగ్రామం చేరడానికి సునీల్ కుమార్ సహకారం

నవతెలంగాణ-ఆర్మూర్/కమ్మర్‌పల్లి

మెండోరా మండలంలోని చాకిరియాల గ్రామానికి చెందిన కమ్మరి రాజేశ్వర్ (65). దుబాయ్ లోని ఓ బల్దియా కంపెనీలో గత కొన్ని సంవత్సరాల నుండి పనిచేస్తున్నాడు. నెల రోజుల నుండి అనారోగ్యానికి గురై అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందగా బుధవారం ఆయన స్వగ్రామంలో అంత్రక్రియలు నిర్వహించారు. అందరితో కలుపుగోలుగా ఉండే ఈయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. చనిపోయిన రాజేశ్వర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు.


ఆర్మూర్: మృతి చెందిన రాజేశ్వర్

కమ్మర్‌పల్లి : మెండోరా మండలంలోని చాకిర్యాల్ గ్రామానికి చెందిన మండోజి రాజేశ్వర్ పొట్ట కూటికోసం దుబాయ్ వెళ్లి అక్కడ మరణించారు. రాజేశ్వర్ మృతదేహం స్వగ్రామం రప్పించేందుకు సహకారం అందించాలని కుటుంబ సభ్యులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌ను కలిసి విన్నవించారు. ఇందుకు తనవంతుగా కృషి చేసి ఆయన మృతదేహం గల్ఫ్ నుండి స్వదేశానికి రావడానికి సహాయ సహకారాలు అందించారు.

హైదరాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్న రాజేశ్వర్ మృతదేహాన్ని అక్కడినుండి స్వగ్రామం చాకిర్యాల్ చేరడానికి ప్రభుత్వం తరపున ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కూడా సునీల్ కుమార్ కల్పించారు. రాజేశ్వర్ మృతి పట్ల సునీల్ కుమార్ మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


పాఠశాల పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను, డిజిటల్ క్లాసుల బోధన తీరును, పాఠశాల ఆవరణను, ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరును, పాఠశాల సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను, మధ్యాహ్నం భోజనంను పరిశీలించారు. విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యత కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. మధ్యాహ్నం భోజన నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆంధ్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాలీ హౌస్‌లో ఆర్కిడ్ పూల తోటను పరిశీలించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

మండలంలోని హాస కొత్తూర్ లో గ్రామానికి చెందిన రైతు మోహన్ నాయక్ పాలీ హౌస్ లో సాగు చేస్తున్న ఆర్కిడ్ పూల తోటను ట్రైని అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఆర్కిడ్ పూల తోట పెంపకంలో గల సస్యరక్షణ విధానంను, అదేవిధంగా మార్కెటింగ్‌లో సమస్యలను, పరిష్కార మార్గాలను, పూల సాగు వల్ల వచ్చే ఆదాయం ఇతరత్రా వివరాలను రైతు మోహన్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. హాసకొత్తూర్ లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు, మార్కెటింగ్‌లో గల సమస్యలను గ్రామంలోని రైతులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ కు గ్రామస్తులు రైతులు ఘన స్వాగతం పలికారు. పాలీ హౌస్ ఆర్కిడ్ పూల తోటను పరిశీలించేందుకు వచ్చిన సంకేత్ కుమార్‌కు రైతు మోహన్ నాయక్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ బి. రాజు, ట్రైని కలెక్టర్ సీసీ, రైతులు పడిగేలా ప్రవీణ్, ఏనుగు మనోహర్, మేడపు రమేష్, కిషన్ గౌడ్, మురళి, రఘు, ఇతర రైతులు, తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

1న బాంసెఫ్ 11వ రాష్ట్ర మహాసభ

- బాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బట్టి చెన్నయ్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

సెప్టెంబరు 1న సంగారెడ్డి అంబేద్కర్ భవన్‌లో బాంసెఫ్ తెలంగాణ రాష్ట్ర 11వ మహాసభలు నిర్వహిస్తున్నామని బాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బట్టి చెన్నయ్య తెలిపారు. బుధవారం నగరంలోని ఆర్‌అండ్‌బి మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. ఈ మహాసభలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా బాంసెఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాన్యవార్ డిఆర్‌ఓహెూల్ హాజరవతరని తెలిపారు. ఓబిసి కులగణన చెయకపొవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామన్న బిజెపిని ఎన్నికలలో ప్రజలు కట్టడి చెసి తగిన బుద్ధి చెప్పారన్నారు. ఓబిసిల కులాధిరిత జనగణన చేయకపోవడం రాజ్యాంగం కల్పించిన హక్కులను అధికారాలను ఉల్లంఘించడమేనన్నారు. ఈ మహాసభలో ఈవిఎంలను నిషేధించి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరపాలని, బిసి జనగణనన, ప్రవేటికరణ తదితర అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యచరణను రూపొందిస్తామని చెన్నయ్య తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు యానాం విజయ్ కుమార్ మాట్లడుతూ.. ఇటివల రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై లాకప్ హింస పెరిగిపొతున్నాయన్నారు. లాకప్ హింసకు పాల్పడుతున్న పొలీసులపై ఎస్సీ, ఎస్టి అట్రాసిటి కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ ఏవైఎస్ రాష్ట్ర నాయకులు రాజమల్లు, సిద్ధిరాములు, ఎస్‌పిపిఎఫ్ జిల్లా అధ్యక్షులు కేశపురం రమేష్, బామ్ సేఫ్ జిల్లా నాయకులు నాగరాజు, బీవిఎం నాయకులు మధు, శ్రవణ్, అరుణ్, బిఎంఎం నాయకులు, ఊళ్లేందుల సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని మించి సభ్యత్వం నమోదు చేయాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్


కార్యకర్తలతో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

లక్ష్యాన్ని మించి భారతీయ జనతా పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల కోదండ రామాలయంలో బిజెపి కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సభ్యత్వాన్ని లక్ష్యాన్ని మించి పూర్తి చేయాలని ఆయన అన్నారు భారతీయ జనతా పార్టీ లక్ష్యం పది వేలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మరి రామిరెడ్డి బిజెపి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ మాజీ అధ్యక్షులు హనుమాన్లు, కిషన్ ,కృష్ణ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్షమాపణ చెప్పి రాష్ట్రంలో అడుగు పెట్టాలి

- జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ మహిళల గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఎమ్మెల్సీ కవిత తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణ చెప్పి తెలంగాణలో అడుగు పెట్టాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి బుధవా రం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కా మ్ లో అరెస్టై, బెయిల్ పై విడుదల అయితే, స్వాతంత్ర సమరయోధులు, ప్రజల కోసం పోరాడి సామాజికవే త్తలు విడుదల అయినట్లు బి ఆర్ ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకోవడం ఏంటని ప్రశ్నించారు. అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించి దుబాయిలో బుర్జ్ ఖలీఫా లో విలాసవంతమైన ప్లాటును కొనుగోలు చేసిందని, ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పినా తీరు మారలేదని ఎద్దేవ చేశారు.

సేంద్రియ ఎరువులతో నేల సారవంతం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలని బానాపూర్ గ్రామంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు వరి పంటపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మల్తుమ్మెద ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అనీల్ రెడ్డి డాక్టర్ రేవంత్ పాల్గొని వరి పంటలో చీడ పీడల నివారణ, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. నేల ఆరోగ్యాన్ని పెంపోదించడం, సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం లో బానాపూర్ గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమానికి కోరమాండల్ ప్రతినిధులు పాపిరెడ్డి సీనియర్ అగ్రనామిస్ట్ , రమేష్ మార్కెటింగ్ ఆఫీసర్ మరియు సతీష్, మహేష్ బానాపూర్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు జరిగే.. హాట్‌స్పాట్‌లను గుర్తించాలి

- ప్రశాంతంగా పండగలు నిర్వహించేలా పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించాలి
- పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేసిన ఎస్పీ సింధూ శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలలో కల సమస్యాత్మక గ్రామాలను పోలీస్ అధికారులు సందర్శించాలని, ట్రబుల్ మాంగర్స్, తరచుగా తగాదాలకు, నేరాలకు పాల్పడేవారి పై నిఘా ఉంచాలని ఎస్పీ సింధుశర్మ సూచించారు. వినాయక చవితి, దేవీ నవరాత్రుల పండుగలు పురస్కరించుకొని పీస్ కమిటీ మీటింగ్ లు ఏర్పాటు చేసి మండపాల నిర్వాహకులతో మాట్లాడాలని అన్నారు. ఆదేవిధంగా జిల్లాలో ఎక్కువగా నేరాలు జరిగే ప్రాంతాల్లో హాట్ స్పాట్ లను ఏర్పాటు చేసి అదునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్రైమ్ మ్యాపింగ్ తయారు చేసి అక్కడ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. పండుగల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం జిల్లా ఎస్పీ సింధు శర్మ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. పెండింగ్ కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్లాన్ ఆఫ్ యాక్షన్ తో పని చేయాలనీ, ప్రతి గ్రామాల్లో సిసి కెమెరాల సంఖ్య పెంచాలన్నారు. విజిబుల్ పొలిసింగ్ తో విదులు నిర్వహించాలనీ, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలనీ, నేరాలు తగ్గేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలనీ, ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలనీ ఎస్పీ జిల్లా అధికారులకు సూచించారు.

ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలనీ, ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి, కేసుల చేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలి, పెరుగుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి ఛాలెంజ్ గా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ కె నరసింహారెడ్డి , కామారెడ్డి డి.ఎస్.పి నాగేశ్వరరావు, ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాసులు, బాన్సువాడ డి.ఎస్.పి సత్యనారాయణ, డిసిఆర్బి డిఎస్పి మదన్ లాల్. స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జార్జ్, జిల్లా సిఐ లు ఎస్. ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సింధూ శర్మ

డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల్లో ప్రజలు, యువత సారాయి, గంజాయి వంటి మత్తు పధార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రొబిషన్ సీఐ మధుసూదన్ రావు అన్నారు . బీబీపేట మండలం లోని మల్కాపూర్, యడరం, బీబీపేట ఆయా గ్రామలలో ఎక్సైజ్ శాఖా ఆధ్వర్యంలో బుధవారం గంజాయి, సారాయి మత్తు పదార్థాల నిషేదంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మధుసూదన్ రావు మాట్లాడుతు రాష్ట్ర . ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో మత్తు పధార్థాల వలన జరిగే అనార్థాలపైన ప్రజలకు అవగాహన కల్పించుతున్నామని తెలిపారు. గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు విక్రయించిట్లయితే తమ దృష్టికి తేవాలని, వారిపైన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలపారు. గ్రామాల్లో నాటు సారాను పూర్తిగా నిర్మూలిస్తామని తెలిపారు. ప్రజలు అధికారులకు సహకరించి గంజాయి , డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుళ్ల సాగర్, శ్వేతా పంచాయతీ కార్యదర్శి లు సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోలీసులు

డాక్టరేట్ పట్టా అందుకున్న మన్నే శ్రీనివాసులు


డాక్టరేట్‌ను అందుకుంటున్న శ్రీనివాసులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అహ్మద్ కళాశాలలో ఉపాధ్యాలుగా పనిచేస్తున్న మన్నే శ్రీనివాసులు ఆంగ్ల విభాగంలో పీహెచ్ డాక్టరేట్ పట్టా పొందారు. కామారెడ్డి కి చెందిన మన్నే శ్రీనివాసులు సన్రైజ్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల విభాగం లో డాక్టరేట్ పట్టా సాధించారు. "ది స్టడీ ఆన్ ముల్క ఆనంద్ కాంట్రిబ్యూషన్ టూ సోషల్ ట్రాన్స్ ఫార్మేషన్ " అనే అంశంపై డాక్టర్ లోకేష్ సింగ్ పర్యవేక్షణలో పరిశోధనలు చేసి యూనివర్సిటీలో సమర్పించారు.

ప్రత్యేక సొసైటీ ఏర్పాటు పట్ల కాంగ్రెస్ పార్టీ సంబరాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఉన్న సొసైటీ నుండి కాచాపూర్ గ్రామానికి గ్రామంలో ప్రత్యేక సొసైటీ ఏర్పాటు చేసినందుకుగాను కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వాపూర్ గ్రామంలో ఉన్న సొసైటీ కార్యాలయ ఆవరణలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాచాపూర్ గ్రామ రైతుల సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సిద్దరాములు, నాయకులు నరేందర్ రెడ్డి, బాగారెడ్డి, మల్లారెడ్డి, చందు, బాబు, జీవన్, స్వామీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-గాంధారి

గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని గాంధారి మండల ఎస్సై ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందే ఎస్సై తెలిపారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6వరకు https://www.tspolice.gov.in సైట్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు. 2 బాక్స్ ట్రైప్ లౌడ్ స్పీకర్లను మాత్రమే వాడాలని, రాత్రి 10 గం.నుంచి ఉ.6 వరకు వాటిని వినియోగించవద్దని తెలిపారు. మండపాల ఏర్పాటుకు చేసేందుకు రోడ్డు మొత్తం బ్లాక్ చేయొద్దని, వాహనాల రాకపోకలు సాగేందుకు వీలుగా స్పేస్ ఉంచాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ కూడా తప్పక పాటించాలని సూచించారు.

అంగన్‌వాడీ హెల్పర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న సిద్ధవ్వ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ శోభారాణి మృతురాలి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా పదివేల రూపాయల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ సభ్యురాలు యాదమ్మ గ్రామస్తులు గంగాధర్, రమేష్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు

రుణమాఫీ కాని కుటుంబాల సర్వే

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని దర్మారావుపేట గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీలో కాని రైతు కుటుంబాల సర్వే చేపట్టారు. రైతుల ఇంటింటికీ వివరాలు సేకరించారు. వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు తెలిపారు.

దాడి ఘటనలో వృద్ధుడు మృతి

- నిందితులను త్వరలోనే పట్టుకుంటాం : పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

పాత గొడవలను దృష్టిలో ఉంచుకొని కొందరు వ్యక్తులు దాడి చేయగా.. వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం వివరాలు వెల్లడించారు. కామారెడ్డి పట్టణంలో గల విద్యానగర్ ఏరియాలో ఉన్న శివాలయం వద్దకు పట్టణానికి చెందిన పాత విశ్వనాథం (64) మంగళవారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో పూజ చేసేందుకు వెళ్లగా.. పట్టణానికి చెందిన లక్ష్మీబాయి, కొంతమంది కలిసి పాత విశ్వనాథమును అడ్డగించి, డబ్బుల విషయమై గొడవపడి, ఇష్టం వచ్చినట్టుగా పిడి గుద్దులు గుద్ది, వారికి కారులో ఎక్కించుకొని పారిపోయే ప్రయత్నం చేయగా, చుట్టుపక్కల వారు గమనించి, వారిని నిలువరించారు. దీంతో అక్కడినుండి లక్ష్మీబాయి, ఆమెతో ఉన్న వ్యక్తులు పారిపోయారు. గాయాల పాలైన పాత విశ్వనాథమును కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కొరకై హైదరాబాదులో ఉన్న యశోద హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. మృతుడి బావమరిది రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిని త్వరలోనే పట్టుకుని న్యాయస్థానం ముందు హాజరుపరుస్తాము అన్నారు.

ధర్మం గెలిచింది

- బీఆర్ఎస్ నేత, మున్సిపల్ చైర్మన్ జుబేర్

నవతెలంగాణా-బాన్సువాడ (నసురుల్లాబాద్)

ఎమ్మెల్సీ కవితపై పలు పార్టీ నేతలు ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, వ్యవస్థలను సమూలంగా మేనేజ్ చేసినా అంతిమంగా ధర్మమే గెలిచిందని బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జుబేర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో బస్టాండు వద్ద ఎమ్మెల్సీ కవిత జైలు నుంచి విడుదల సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కవితపై బెయిల్ రావడంపై హర్షం వ్యక్తం చేశారు. చేయని తప్పునకు కవిత జైళ్లలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్, కవితలపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని, వచ్చే ఎన్నికల్లో కొన్ని పార్టీల ఆనవాళ్లు రాష్ట్రంలో కనపడకుండా పోతాయని జుబేర్ స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మోచి గణేష్, నర్సింలు గౌడ్, టేకుర్ల సాయిలు, గౌస్, రమేష్ యాదవ్, మోసిన్, మంగళి సాయి, అల్లం గంగారాం, అన్వర్, బద్రి, తదితరులు పాల్గొన్నారు.


సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

నీటి సమస్యను తీర్చిన చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని 47వ వార్డులో నీటి సమస్య ఉందని వార్డు ప్రజలు మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియకు తెలపగా స్పందించి బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నూతన బోర్ వేయించి నీటిని అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చెట్లు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మనమందరం కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుందున ప్రతి ఒక్కరు ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, వార్డ్ కౌన్సిలర్, గేరిగంటి లక్ష్మీనారాయణ, పాత శివ కృష్ణమూర్తి, పంపరి లతా శ్రీనివాస్, చాట్ల వంశీ, పిడుగు మమతా సాయిబాబా, నజీరుద్దీన్, పిట్ల వేణు, మాజీ కౌన్సిలర్ జూలూరు సుధాకర్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేసిన మున్సిపల్ చైర్పర్సన్

లార్వా సర్వే.. మందుల పిచికారి

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని మత్తడి కిందిపల్లి ఒకటో వార్డులో బుధవారం ఇంటింటా జ్వరం సర్వే లార్వా సర్వే నిర్వహించినట్టు వైద్యాధికారి హిమబిందు తెలిపారు. మత్తడికింది పల్లిలోని ఇంటింటికి వెళ్లి డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ చికెన్ గునియా పాటు సీజనల్ వ్యాధులు గురించి సర్వే నిర్వహించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్‌లు యాదగిరి చంద్రకళ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ వైద్య సిబ్బంది భాగ్య లక్ష్మి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల పరిశీలన


నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని లింగంపల్లి వదలపర్తి గ్రామాలలో పారిశుద్ధ్య పనులను బుధవారం రోజు ఎంపీడీవో ప్రభాకర్ చారి పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. అదేవిధంగా వైకుంఠధామం, కంపోస్టు షెడ్ పరిసరాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వనజ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన జిల్లా సహకార అధికారి

నవతెలంగాణ - కామారెడ్డి

హైదరాబాద్ టీఎస్ మార్కెఫెడ్ కార్యాలయం నుండి బదిలీపై నూతనంగా జిల్లా సహకార అధికారిగా వచ్చిన బి.మమత బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేశారు. తదనంతరం తన కార్యాలయంలో జిల్లా సహకార అధికారిగా బాధ్యతలు చేపట్టారు.


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న మమత

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో 44వ జాతీయ రహదారి పై బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బాలమణి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుండి కామారెడ్డి వైపు వస్తున్న కారు ఢీ కావడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి జీఎంఆర్ అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ఆమెను సిబ్బంది కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.


గాయపడ్డ వృద్ధురాలు

దత్తాత్రేయ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని దత్తాత్రేయ ఆలయం శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణం కోసం బుధవారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధారి తాజా మాజీ సర్పంచ్ ముమ్మాయి సంజీవ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తూర్పు రాజు, మరియు తాడ్వాయి సంతోష్, మల్లేష్, కృష్ణా గౌడ్, లక్ష్మీకాంత్, వెంకటేష్ చారి, రవి గౌడ్ పాల్గొన్నారు.

పూర్వీకులు అందించిన ఆయుర్వేదం అద్భుతమైనది

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వారి సహకారంతో ఔషధ మొక్కలను నాటినట్టు సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా దోమకొండ పోర్ట్ ట్రస్ట్ నిర్వహకులు బాబ్జీతో కలిసి ప్రారంభించారు. విశ్వవిద్యాలయాలలో నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చిన నాటి నుండి ప్రాచీన కాలం విలువలు, పద్ధతులు మారుతున్నాయని, విశ్వవిద్యాలయం లో చదువుతున్న ఆరోగ్య సంబంధమైన సమస్యలు రాకముందే ఆయుర్వేద మొక్కల ద్వారా నివారణ చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానం అలవాటు పడుతుందని క్యాంపస్ ఆవరణలో తులసి, అలోవెరా, లెమన్ గ్రాస్, తమలపాకు, విద్యార్థుల జ్ఞాపకశక్తి కోసం సరస్వతి, బ్రహ్మీ, శంకు పుష్పాలను ఉసిరి, నేల ఉసిరి, రణపాల, ఇన్సులిన్ మొక్క, గోరింటాకు, ఓమ, కరివేపాకు, లవంగం, మిరియాలు వంటి మొక్కలను నాటినట్టు తెలిపారు. దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలకు మన పూర్వికులు ఎంతో జ్ఞాన సంపదను అందించారని వాటిని తెలుసుకొని అలోపతి కంటే ఆయుర్వేదం గొప్పదని గో బ్యాక్ రూట్స్ అన్నారు. కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ హరిత, డాక్టర్ వీరభద్రం, డాక్టర్ యాలాద్రి, డాక్టర్ సునీత డాక్టర్. యస్ నారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాల నివారణపై అవగాహన

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని సాందీపని జూనియర్ కళాశాల విద్యార్థులకు మానవ అక్రమ రవాణా చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కామారెడ్డి పోలీస్ అధికారి రాజేందర్ మాట్లాడుతూ హ్యూమన్ ట్రాఫికింగ్ చట్టం అనేది మానవ ట్రాఫికింగ్ నిరోధించడానికి, ఆపడానికి రూపొందించబడిన చట్టం అన్నారు. మానవ ట్రాఫికింగ్ అనేది వ్యక్తులను బలవంతంగా లేదా మోసంతో ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి తరలించడం, అక్కడ వారితో వ్యాపారం చేసి లబ్ధి పొందడమన్నారు. సోషల్ మీడియా ప్రభావం వలన మానవ అక్రమ రవాణా ఎక్కువ జరుగుతుందని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కామారెడ్డి సోషల్ వర్కర్, మాలోత్ మోహన్ , చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేస్ వర్కర్ స్రవంతి మాట్లాడుతూ పిల్లలపై జరిగే లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012 గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికడదాం, బాలల హక్కులను కాపాడుదాం, బాల్య వివాహాల వలన బాలికల అతి చిన్న వయసులో గర్భం దాల్చడం దీనివల్ల తల్లి బిడ్డలు ఇద్దరికీ ప్రమాదకరం అని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో సాందీపని జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, కామారెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులతో విషజ్వరాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విడిసీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డి మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా విష జ్వరాలు వస్తున్నాయని, వాటి నివారణ కోసం వైద్య సిబ్బంది సహకారంతో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జ్వర లక్షణాలు ఉన్న వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ చంద్రకాంత్ రెడ్డి, మండల వైద్యాధికారి హేమిమా, డాక్టర్ అమిత, ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, సతీష్, పంచాయతీ సెక్రెటరీ ప్రశాంత్, గ్రామాభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు శశి కుమార్, వినోద్ గౌడ్, హరికృష్ణ రెడ్డి, రెడ్డి సంఘ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, రమేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఆరోగ్య సిబ్బంది మాధవి, ఆశా కార్యకర్తలు కీర్తి, సంగీత,, రేణుక గ్రామస్తులు పాల్గొన్నారు.

తపాలా బీమను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సదాశివనగర్

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలని పోష్టల్ అధికారి శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో బుధవారం విజయ డెయిరీ ఆధ్వర్యంలో రైతులకు తపాలా బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు బీమా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని దోమకొండ కోట గ్రామ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను మాజీ జడ్పీటీసీ ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్ని గుర్తించడానికి మండల స్థాయిలో అండర్ 18 స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమం లో ట్రస్ట్ మేనేజర్ బాబ్జీ, ప్రిన్సిపల్ శంకర్, ఏఎస్ఐ చారి , వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

భూంపల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరం

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని భూంపల్లిలో వైద్య శిబిరం కొనసాగుతుంది. బుధవారం 86 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించారు. 55 మంది నుండి శాంపిల్ తీసుకుని టెస్ట్‌కు పంపినట్టు తెలిపారు. 2 కేసులను హైయర్ సెంటర్ కు పంపిన ట్లు తెలిపారు. ఇంటింటికీ లార్వా సర్వే, దోమల పిచికారి చేపడుతున్నట్టు తెలిపారు.

పాడి పశువుల లబ్ధిదారులకు శిక్షణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండల సమాఖ్యలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పాడి పశువుల పెంపకంలో మెళకువలపై పాడి పశువుల లబ్ధిదారులకు బుధవారం పట్టణంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బస్వారెడ్డి విచ్చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు ప్రభాకర్, ఐకేపీ ఏపీఎం గంగారం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బస్వారెడ్డి

సంఘ సభ్యులకు రుణాల అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల

తాళ్ల రాంపూర్ పీఏసీఎస్ పరిధిలోని, రుణమాఫీ అయిన 52 మంది సంఘ రైతులు, కొత్తగా వార్షిక రుణం కోసం దరఖాస్తు చేసుకోగా 49 లక్షల 75 వేల రూపాయలు మంజూరయ్యాయని, బుధవారం వాటిని సభ్యులకు అందజేశామని సంఘ అధ్యక్షులు పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కొత్తగా పంట రుణాలు కావాల్సిన రైతులు సంబంధిత పత్రాలు తీసుకు ,సొసైటీకి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు దేశబోయిన సంజీవ్, సంఘ సభ్యులు సోమిరెడ్డి శ్రీనివాస్,ఎర్ర శశింధర్,వెంకయ్య గారి శ్రీనివాస్,మద్దెల ముత్తెన్న,సంఘ సంఘ కార్యదర్శి గణేష్,రైతులు పాల్గొన్నారు.



రుణాలు అందజేస్తున్న సంఘ సభ్యులు

రుణమాఫీ కానీ రైతుల వివరాల సేకరణ

- కుటుంబ సభ్యుల వివరాల నమోదు ప్రారంభం



రైతు కుటుంబసభ్యులతో ఫొటో తీస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ - బాల్కొండ

రైతు రుణమాఫీ పథకంలో భాగంగా ఇప్పటివరకు 600 మంది రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారని బుధవారం మండల వ్యవసాయ అధికారిని బి.లావణ్య తెలిపారు. ఈ దరఖాస్తులలో కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయవలసి ఉంటుందని అన్నారు. దరఖాస్తులను రైతుల ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను రైతు భరోసా యాప్‌లో నమోదు చేస్తామని అన్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో మండల వ్యవసాయ అధికారి ఫోటో దిగి యాప్‌లో అప్లోడ్ చేస్తారని తెలిపారు. తర్వాత దరఖాస్తుదారుని ధ్రువీకరణ పత్రం తీసుకుంటామని పేర్కొన్నారు. మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో ఈనెల 28 , బస్సాపూర్ 29, చిట్టాపూర్ 30, జలాల్ పూర్ 31, వన్నెల్ బి సెప్టెంబర్ 2, ఇత్వార్ పేట్ 3, బోదేపల్లి 4, నాగపూర్ 5, బాల్కొండ 6,9,తేదీలలో గ్రామాలను సందర్శించి మొబైల్ యాప్‌లో రైతు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తామని అన్నారు. మొబైల్ యాప్ లో నమోదు కోసం గ్రామానికి వచ్చినప్పుడు రైతులు సహకరించాలని ఏవో కోరారు.

పట్టపగలే ఊక తరలింపు



బోధన్ వైపు వెళ్తున్నఊకలారీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలో ఒక లారీలు పట్టపగలే ఊకను నింపుకొని లారీల యజమానులు సమయపాలన పాటించకుండా తరలిస్తున్నారు. నిజామాబాద్ నుండి ఎడపల్లి పరిధిలోని సాటాపూర్ గేట్ మీదుగా వయా రెంజల్ వైపు ఊక లారీలు తరలి వెళుతున్నాయి. బోధన్ వైపు కూడా లారీలు అధిక మోతాదుతో ఊకను తీసుక పోవడం పట్ల లారీల వెనుక ఉన్న ద్విచక్ర వాహనాల యజమానుల కళ్ళల్లో ఊక పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని వాపోతున్నారు. మండలంలో ఇటుక బట్టీలు విచ్చలవిడిగా వెలిశాయి. ఆర్‌టిఏ, ఆర్డీవో అధికారుల ఆదేశాల మేరకు ఊక లారీలు సాయంత్రం 6 గంటల నుండి ఊక లారీలద్వారా తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఉదయం నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఒక లారీల మిలపకూడదని అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ ఊక లారీల యజమానులు తమ ఇష్టానుసారంగా పట్టపగలే తమ ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో


నవతెలంగాణ-భీంగల్ రూరల్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కూమార్ అన్నారు. మండలంలోని పల్లికొండ గ్రామంలో పారిశుధ్య పనులు, ఇంటర్నల్ ప్లాంటేషన్ పనులను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లలో నిలువ నీటిని తొలగించడం, యాంటీ లార్వా స్ప్రే, పిచ్చిమొక్కల తొలగింపు మురికి కాలువలో పూడికతీత పనులను పర్యవేక్షించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందితో పంచాయతీ కార్యదర్శి అంగన్వాడి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి వ్యాధుల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు(ఆర్ బి ఎస్ కే) రాష్ట్రీయ స్వస్తియా కార్యక్రమంలో ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులకు జ్వరం, దగ్గు, వైరల్ జ్వరాలను వైద్యురాలు రుబీనా పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్, గంగా ప్రసాద్ హరికృష్ణ రజిని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

క్రీడలకు ప్రోత్సాహం ఏది?

- నేడు అంతర్జాతీయ క్రీడాదినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

ఒకనాడు మనిషి జీవితంలో ఆటలు భాగంగా ఉండేవి. ఏదో ఒక క్రీడతో మనిషి జీవితం ముడిపడి ఉండేది. కానీ నేటి కంప్యూటర్ యుగంలో ఆధునిక పోకడల వైపునకు పరుగులు పెడుతున్న సమాజం క్రీడలను మరచి పోతుంది. క్రీడలు సందర్భానుసారంగా కనిపిస్తున్నాయి. ప్రముఖ హాకీ క్రీడాకారులు ధ్యాన్చంద్ పుట్టినరోజు అయిన నేడు అంతర్జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని నవ తెలంగాణ ప్రత్యేక కథనం..

హాకీ మాంత్రికుడు ధ్యానచంద్...

ధ్యాన్‌చంద్ అనే పేరు వినగానే అతని చేతిలో మంత్రదండంలా కదిలే హాకీ కర్ర గుర్తుకు వస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో హాకీ క్రీడనే శాసించే స్థాయికి ఎదిగిన హాకీ మాంత్రికుడు 1905 ఆగస్టు 29న ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్‌లో జన్మించారు. 1922లో బ్రిటిష్ ఆర్మీలో చేరిన ఆయన క్రీడాకారునిగా ఎదుగుతూ సుబేదార్ నుంచి ఏకంగా మేజర్‌గా పదోన్నతి పొందారు. ఈరోజు క్రీడాకారులకు ఓ పండగ దినం. 1928, 1932, 1936 ఒలంపిక్స్‌లో ఆటగాడిలా స్వర్ణాలు, 19 48, 52, 56లలో భారత జట్టు శిక్షకుడిగా బంగారు పథకాలు సాధించిన ఘనత ఒక్క ధ్యాన చెందుకే సాధ్యమైంది. 1956లో పద్మభూషణ్ అవార్డు ఇచ్చి ఘనంగా సన్మానించింది.

క్రీడలను మర్చిపోతున్న నేటి సమాజం...

పాఠశాల స్థాయి నుంచి చిన్నారులు క్రీడలకు నోచుకోవడం లేదు.. ఒకప్పటి గ్రామీణ ప్రాంత క్రీడలన్నీ అంతరించిపోయాయి. నేటి విద్యార్థులు క్రీడలను పుస్తకాల్లో చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులు ఆటలకు దూరం అవుతుండడం ఒకరకంగా మనిషిని మానసికంగా శారీరకంగా ప్రశాంతతకు దూరం చేస్తున్నాయని చెప్పవచ్చు. క్రీడలతో మానసికోల్లాసం అన్న పదం ఊతపదం గానే మారినప్పటికీ ఆ క్రీడలను మాత్రం ప్రోత్సహించే వారు కరువయ్యారు. ఆటల కోసం క్రీడా మైదానాలు ఉంటున్నాయా..? క్రీడల కోసం ఎంత సమయాన్ని వెచ్చిస్తున్నారు.. ? అని అంటే క్రీడలను నేటి సమాజం మరిచిపోతుంది అని చెప్పుకోవచ్చు.

గ్రామీణ క్రీడలకు ఆదరణ కరువు...

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు ఎన్నో క్రీడాకారులు కనిపించేవి. వందల సంఖ్యలో గ్రామీణ క్రీడలు కనిపించేవి. గోలి ఆట మొదలుకొని కబడ్డీ వరకు ఎన్నో రకాల ఆటలు కనిపించేవి. సెలవు దినాలు పండుగలు వస్తే గ్రామీణ క్రీడలకు ఎంతో ఆదరణ ఉండేది. అలాంటి గ్రామీణ క్రీడలు నేడు కనిపించకుండా పోయాయి. టీవీలు, కంప్యూటర్ల ముందు సమయం కేటాయిస్తున్న నేటి తరం వీడియో గేమ్‌లతో తమ బాల్యాన్ని చిదిమేస్తున్నారు. టీవీల్లో కనిపించే క్రీడలే నేటి సమాజానికి క్రీడలుగా కనిపిస్తున్నాయి. తాము ఆడాల్సింది పోయి ఎక్కడో ఆడిన క్రీడలను చూసి సంబర పడాల్సిన దుస్థితి ఏర్పడింది. క్రీడలపై మక్కువతో ఎంతోమంది యువకులు ఆయా క్రీడల్లో తమ అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్నారు. వారికి ఇలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో పనులు చేసుకుంటూ బతుకు వెల్లదీస్తున్నారు..



ప్రోత్సహిస్తే జాతీయ స్థాయికి..

ప్రోత్సహిస్తే చాలు జాతీయ స్థయిలో రాణించేందుకు సిద్ధంగా ఉన్నారు జిల్లా క్రీడాకారులు. జిల్లా ఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. జిల్లాకు చెందిన యెండెల సౌందర్య హాకీలో జాతీయస్థాయికి తీసుకెళ్లగా బాక్సింగ్ క్రీడాకారిని నిఖత్ జరినా ప్రపంచ బాక్సింగ్ పోటీల్లో రాణించింది. గుగులోత్ సౌమ్య జాతీయ ఫుట్బాల్ జట్టుకు ఎంపిక అయింది. సిరికొండ మండలంలోని పాకాల గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని మలావత్ పూర్ణ చిన్న వయసులోనే ఎవరెస్ట్ పర్వతం అధిరోహించి జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు క్రీడాకారులు రాణిస్తున్న తగిన ప్రోత్సాహం లేక క్రీడాకారులు ముందుకు వెళ్లలేక పోతున్నారు. ప్రభుత్వాలు మారిన క్రీడా రంగానికి ప్రోత్సాహం కరువైపోయింది. అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ ఆటకు మాత్రమే క్రేజీ ఉండడంతో యువకులంతా అటువైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం విద్యపై చూపించే శ్రద్ధ క్రీడలపై కూడా చూపిస్తే మరో సింధు, సాక్షి, సైనా నిహాల్, దీప వంటి క్రీడాకారులు వెలుగులోకి వచ్చి దేశ ఖ్యాతిని నలుమూలల విస్తరింప చేస్తారని ఆశిద్దాం.

జిల్లాల్లో స్టేడియాల నిర్మాణంతో సరి...

జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నప్పటికీ క్రీడాభివృద్ధి విషయంలో మాత్రం ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవడం లేదు. నగరంలోని క్రీడాకారులకు పాత కలెక్టరేట్ మైదానమే దిక్కయింది. ఏళ్ల తరబడి ఈ యొక్క మైదానమే క్రీడాకారులకు ఉపయోగపడుతుంది. ఈ మైదానంలోనే హాకీ, బాక్సింగ్, కబడ్డీ, బాస్కెట్‌బాల్ హ్యాండ్ బాల్, ఉషు, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో సీనియర్ క్రీడాకారులు శిక్షణ ఇస్తున్నారు. వారి ఆధ్వర్యంలో బాక్సింగ్‌లో నిఖిత్ జరిన ఉసముద్దీన్, ఫుట్‌బాల్లో సౌమ్య, హాకీలో యోండెల సౌందర్య తదితరులు శిక్షణ తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు.

జిల్లాల్లో పలుచోట్ల..

జిల్లాలోని పలుచోట్లస్టేడియంలో నిర్మించి వదిలేశారు. జిల్లా కేంద్రంలోని నాగారం రాజారం మైదానానికి 95 లక్షలతో ప్రహరీ నిర్మించారు. బోధన్ పట్టణంలోని చక్కర్ నగర్‌లో 1.10 కోట్లతో 7 ఎకరాల్లో, జక్రాన్‌పల్లి మండలంలోని నారాయణపేట వద్ద 2.10 కోట్లతో ఐదు ఎకరాలలో స్టేడియాలు నిర్మించారు. ఆర్మూర్‌లో 1.05 కోట్లతో మూడు ఎకరాలలో మినీ స్టేడియం కట్టారు. కమ్మర్పల్లి లో2.05 కోట్లతో ఐదు ఎకరాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. వేల్పూర్ లో కోటితో 5 ఎకరాలలో క్రీడా మైదానం నిర్మించారు.

జాతీయ రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న మగ్గిడి విద్యార్థులు..

మండలంలోని మగ్గిడి గ్రామ ఉన్నత పాఠశాల పిడి మధుసూదన్ క్రీడల్లో సత్తా చాటేలా విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. జాతీయ రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించడంలో విజయవంత మయ్యారు. ఎందరో బంగారు పతకాలు సాధించారు. 9 మంది క్రీడాకారులు జాతీయస్థాయిలో 18 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను చాటారు. క్రీడాకారిని నిషిత స్పోర్ట్స్ అకాడమీ వైజాగ్‌కు ఎంపిక కాగా, పదిమంది వరకు విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో త్రిబుల్ ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు సాధించారు. 2012 జమ్మూ కాశ్మీర్లో జరిగిన జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో తెలంగాణ బాలికల జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. పదేళ్ల నుంచి తెలంగాణ వాలీబాల్ జట్టుకు 8సార్లు కోచ్‌గా బాధ్యతలు నిర్వహించగా 2022, 23 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. వీరితో పాటు మల్లేష్ గౌడ్, గంగా మోహన్, గంగాధర్, మంచిర్యాల సురేష్, పవన్, రాజా గౌడ్, పింజా సురేందర్, నరేంద్ర చారి, పవన్, గటాడి రాజేష్, రాజేశ్వర్ తదితరులు విద్యార్థులకు ఆటలలో నైపుణ్యాన్ని పెంచేలా కృషి చేస్తున్నారు.

ఎందరికో ఆదర్శం ఈ క్రీడాదాత..

బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ స్వగ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త విద్యాదాత, క్రీడాదాత ఏనుగు దయానంద రెడ్డి ఎందరికో ఆదర్శంగా నిలిచినారు. అంతర్జాతీయ రాష్ట్రస్థాయిలో క్రీడాకారులను తయారు చేసేందుకు ఇటీవల 30 పాఠశాలలకు 15 లక్షల క్రీడా సామాగ్రిని అందజేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. జిల్లాలోని అనేక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ప్రోత్సాహాన్ని అందించాలి..

మధుసూదన్, పీడి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మగ్గిడి



గ్రామీణ స్థాయిలో క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం ఇప్పిస్తే ఒలంపిక్ క్రీడాకారులుగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. మౌలిక వసతులను కల్పించాల్సి క్రీడలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి..

ప్రతి క్రీడను గుర్తించాలి...

జైడి రాజ్ కుమార్-పీడి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల-బాల్కొండ



గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలో మాణిక్యాలు ఎందరో ఉన్నారు. ప్రతి క్రీడను గుర్తించి అందులో నైపుణ్యం ఉన్నవారికి శిక్షణను ఇస్తే క్రీడలకు క్రీడాకారులకు పూర్వవైభవం వస్తుంది.

ఆయిల్ సాగుపై అవగాహన

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఆయిల్‌ఫామ్ అవగాహన సదస్సులో భాగంగా రైతు ఆదే ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుతో బంగారు భవిష్యత్తు ఉంటుందనీ ఇంకా వ్యవసాయ కూలీల కొరత, ఆర్థికభారం, పెట్టుబడులు పెరిగి ఇక్కట్లు పడుతున్న రైతులకు ప్రత్యమ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు ఉపయోగపడుతుందని నిజామాబాద్ జిల్లా రైతు ఆదే ప్రవీణ్ కుమార్ తెలిపారు. తన గ్రామంలోని నాలుగున్నర ఎకరాల భూమిలో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటించానని, ఇప్పుడున్న పరిస్థితులల్లో ఆయిల్ ఫామ్ పంట వైపు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు మన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తుందని అన్నారు. ఒక్క ఆయిల్ ఫామ్ మొక్క 193 రూపాయలు వుంటే అందులో సబ్సిడీ కింద 173 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న రైతు

కేవలం రైతు ఒక్క మొక్కకు 20 రూపాయలు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని, ఆయిల్ ఫామ్‌లో అంతర పంటల నిర్వహణకు ఎకరానికి 4200 రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. ఇంకా డ్రిప్ సబ్సిడీ కింద ఎస్టీ, ఎస్సీ రైతులకు 100శాతం సబ్సిడీకి అర్హులని (ఐదు ఎకరాల వరకు), చిన్న, సన్నకారు రైతులయితే 90శాతం సబ్సిడీకీ అర్హులని తెలిపారు. మిగతా రైతులు 80శాతం (ఐదు ఎకరాల వరకు) అర్హులనీ ఆయిల్ ఫామ్ చట్టం 1993 ద్వారా రైతులకు పరిరక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాలనుండి కాపు మొదలై 30 సంవత్సరాల వరకు పంట ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. తెగుళ్ళ, చీడ పీడలు ఇతర పంటలతో పోలిస్తే చాలా తక్కువనీ, ఆయిల్ ఫామ్ సాగులో ఖర్చులు కూడా తక్కువని అన్నారు. ఇంకా కూలీల అవసరం కూడా చాలా తక్కువగా ఉంటుందని, ఒక వ్యక్తి పది ఎకరాల వరకు ఆయిల్ ఫామ్ తోటను సులువుగా పర్యవేక్షించవచ్చుననీ తెలిపా రు. కార్యక్రమంలో ప్రియునిక్ కంపెనీ ఇంచార్జి గణేష్, ఆదే నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల హక్కులకోసం నిరంతరం పోరాడుతాం

- వీహెచ్‌పీఎస్ జాతీయ నాయకురాలు సుజాత సూర్య వంశీ
- వీహెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరణ



మాట్లాడుతున్న సుజాత సూర్యవంశీ

నవతెలంగాణ-రెంజల్

వికలాంగుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ అన్నారు. మండలంలోని దూపల్లి గ్రామంలో బుధవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భవించి 38 సంవత్సరాలు పూర్తి అయ్యాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులకు 6000 పింఛన్ ఇస్తానని హామీ ఇచ్చి ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వికలాంగులకు నెలకు 6000 రూపాయల పింఛన్లు ప్రకటించాలని లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. గత కొన్ని సంవత్సరాలుగా బ్యాక్‌లాక్ పోస్టుల్లో వికలాంగుల నియామకాలు చేపట్టకపోవడం శోచనీయమని ఆమె పేర్కొన్నారు. వికలాంగుల పట్ల వివక్ష చూపినట్లయితే ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నేతృత్వంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ గారి భూమయ్య, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సంఘం శ్రీనివాస్, వికలాంగుల పోరాట సమితి జిల్లా నాయకులు కర్ణం గంగాధర్, మీసాల అబ్బయ్య, ధనుర్ సాయిలు, పోశెట్టి,అజ్జం సాయిలు, బాయికాడి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ బాల్కొండ మండల అధ్యక్షునిగా వేల్పూర్ శ్రీనివాస్

నవతెలంగాణ - బాల్కొండ

మండల కేంద్రంలో పిఆర్టియు మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల అధ్యక్షులు వేల్పూర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పిఆర్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరలోనే ఉపాధ్యాయుల సమస్యలన్ని పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం పిఆర్టియు ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షునిగా వేల్పూర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం ప్రతాపరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా పిల్లి గోపి, కార్యదర్శిగా రాజేశ్వర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా విద్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పిఆర్టియు అధ్యక్షులు పి మోహన్ రెడ్డి. డివిజనల్ ఇంచార్జ్ లక్ష్మణ్ పటేల్, మండల, జిల్లా, రాష్ట్ర బాధ్యులు,వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.



మహిళాశక్తి కార్యక్రమాలు వినియోగించుకోవాలి

- మండల సమైక్య రిప్రజెంటీవ్ జనరల్ బాడీ సమావేశం



మాట్లాడుతున్న ఏపిఎం రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహిళా శక్తి కార్యక్రమాలు వినియోగించుకోవాలని ఏపీఎం రవీందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో జక్రాన్ పల్లి మండల మహిళా సమాఖ్య రిప్రెజెంటీవ్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో బ్యాంకు రుణాలు శ్రీనిధి రుణాలు వినియోగించుకోవాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమాల్లో భాగంగా పాడి గేదెలు, నాటు కోళ్ల, పెంపకం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితర కార్యక్రమాలను మహిళా సంఘం సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గత సంవత్సరం వార్షిక లావాదేవీలు మండల సమైక్య కార్యదర్శి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 31 మహిళా గ్రామ సమైక్య అధ్యక్షులు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మండల సమైక్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బాల చంద్రం

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పున రుద్ధరించాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బాలచంద్రం డిమాండ్ చేశారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదులో భాగంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ స్టేట్ టీచర్స్ యూనియన్ పాత పెన్షన్ విధానానికి కట్టుబడి ఉందని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దాకా ఉద్యమిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వము ఉద్యోగులకు ఇష్టంలేని ఏకీకృత పెన్షన్ విధానాన్ని స్టేట్ యూనియన్ వ్యతిరేకిస్తుందన్నారు. కావున పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని,పెండింగ్ డీఏ లను వెంటనే మంజూరు చేయాలని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బోధన్ అధ్యక్షులు సలీం, కార్యదర్శి కిశోర్, జిల్లా కార్యవర్గసభ్యులు శ్రీనివాస్ రావు, యూసుఫ్ , ప్రసాద్, శ్రీనివాస్, వహీద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

రేషన్ కార్డు లేని రైతుల వివరాలు ఈ యాప్‌లో నమోదు

- ఏవో రాజు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని రైతు వేదిక యందు రేషన్ కార్డు లేని రైతులకు కుటుంబ నిర్ధారణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ యాప్ నందు మండల వ్యవసాయ అధికారి రాజు రేషన్ కార్డు లేని రైతుల దరఖాస్తులని పరిశీలించి యాప్ నందు నమోదు చేశారు. అలాగే ఈనెల 29 నుంచి ఉమ్మడి మండలంలోని డోంగ్లి మండలలో పర్యటించి అన్ని గ్రామాల్లో రేషన్ కార్డు లేని రైతుల యొక్క కుటుంబ నిర్ధారణ చేసి యాప్ యందు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు అనిల్, విశాల్, సంపత్, బజన్న, గజనన్, సంరిన్, సంయుక్త. ఆయా గ్రామాల రైతులు, పాల్గొన్నారు.



యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్న ఏవో

చేప పిల్లల విడుదల

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మేంగారం ఊర చెరువులో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు దాసరి పర్వయ్య ఆధ్వర్యంలో చెరువులో చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ముదిరాజ్ కులస్తులు చేప పిల్లలు పెంచే బాధ్యత తీసుకోవాలని సహకార సంఘం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే తమ వంతు బాధ్యతగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షులు దాసరి పర్వయ్య కార్యదర్శి తంత్రివెంకట్, కంది రాజశేఖర్, దత్తురం తంత్రిఅశోక్, ప్రశాంత్, నాగరాజు, తంత్రి అనుమంతు, సురేష్, మన్నె బాలయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



నీటిలో చేప పిల్లలను విడుదల చేస్తున్న పలువురు

బయోటెక్నాలజీ విభాగాధిపతిగా డా.యం. ప్రసన్న శీల

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సందీప్ కుమార్ సుల్తానియా(ఐఏఎస్) ఆదేశాల మేరకు బయోటెక్నాలజీ విభాగాధి పతిగా డాక్టర్ యం. ప్రసన్న శీలకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదిగిరి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం డాక్టర్. ప్రసన్న శీల జువాలజీ విభాగానికి విభాగాధిపతిగా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ ప్రసన్న శీల గతంలో అడిషనల్ కంట్రోలర్ గా, ఉమెన్ సెల్ డైరెక్టర్ గా, పబ్లికేషన్స్ సెల్ డైరెక్టర్‌గా, బి ఓ ఎస్ చైర్పర్సన్ బయోటెక్నాలజీ లాంటి అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్ పదవులను నిర్వహించారు. డాక్టర్ ప్రసన్న శీల జాతీయ అంతర్జాతీయ ప్రసిద్ధి చెందిన అత్యధిక ఇంపాక్ట్ ఫ్యాక్టర్ కలిగిన జర్నల్స్ లో వర్తమానంశాలపై శాస్త్ర సాంకేతిక రంగంలో జరుగుచున్న పరిణామాలపై అనేక పరిశోధన పత్రాలు ప్రచురించారు. ఇటీవల యాంటీ క్యాన్సర్ డ్రగ్స్‌పై విశేషమైన పరిశోధన చేసినందుకు మంచి గుర్తింపు పొందారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో భూమి క్రమబద్ధీకరణ

- రెవెన్యూ అధికారి హన్మాండ్లు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఎల్‌ఆర్‌ఎస్‌తో భూమి క్రమబద్ధీకరణ అవుతుందని రెవెన్యూ అధికారి హన్మాండ్లు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు 173 మంది దరఖాస్తు చేసకున్నారు. ధరకాస్తు చేసిన భూములకు అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలిం చారని, గతంలో ఆన్‌లైన్ చేసిన వారి వద్దకు వెళ్లి భూమి పరిశీలించడం జరుగుతుందన్నారు. సర్వే నెంబర్లు, ప్లాట్ అప్లికేషన్ల, సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి వంటి అంశాలను పరిశీలించారని తెలిపారు. డాక్యుమెంట్లు, ప్లాట్ ఇమేజెస్, మాస్టర్ ప్లాన్ జత చేసి ఉండాలన్నారు. ఆ స్థలం ప్రభు త్వానిదా, సికం భూమి, ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నదా లేదా అని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యకాంత్, ఇరిగేషన్ అధికారి అజమ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్ రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న పలువురు

ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకటి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కనిరాం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఎల్లారెడ్డి మండలం అధ్యక్షులుగా ఎం.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా ఎస్.సాయిలు, ఉపాధ్యక్షులుగా నౌషా, సంగ్యా, సాయిలు, కార్యదర్శులుగా మాన్యా, శివరాములు, జ్ఞానేశ్వర్, ఉమాదేవి, సురేఖలను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు వెంకటయ్య తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఐక్యత కోసం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరుపేద విద్యార్థుల చదువు కోసం ఎల్లప్పుడూ పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షులుగా పానుగంటి సతీష్ రెడ్డి నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



బీజేవైఎం నిజామాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా మండలం లోని సుద్దపల్లి గ్రామానికి చెందిన పానుగంటి సతీష్ రెడ్డిని నియమించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి నియామకాపు పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈసందర్భంగా పానుగంటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా బిజెవైఎం అధ్యక్షులుగా నియామకానికి కృషిచేసిన వారందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్యుత్ అమరులకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా చంద్రబాబు తీసుకువచ్చిన విద్యుత్ వ్యతిరేక విధానాలను వ్యతిరేస్తూ చేపట్టిన ఉద్యమంలో అసువులు బసిన వారిని స్మరించుకుంటూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పట్టణంలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బి.దేవారం మాట్లాడుతూ.. ప్రపంచ బ్యాంక్ తెచ్చిన ఆర్థిక సంస్కరణలో భాగంగా నాటి చంద్రబాబు ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు తెచ్చి ప్రజలకు తీవ్రమైన నష్టం కలిగించేలా చేశారన్నారు. రైతాంగానికి ఈ విద్యుత్ సంస్కరణలు పెనుముప్పుగా మారాయి. ఈ సందర్భంగా కమ్యూనిస్టుఉమ్మడిగా ఐక్య కార్యాచరణ ద్వారా చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారన్నారు. వేలాది మంది హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టారు. చంద్రబాబు నాయుడు భాష్పవాయువు ప్రయోగాలు, ఇనుప కంచెలు నిలువరించలేక పోయాయి. చివరికి ఆందోళనపై పోలీసులతో కాల్పులు జరిపి వేలాది మందిని గాయపర్చారన్నారు. రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిని బలిగొన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం పట్ల విద్యుత్ రంగం పట్ల తీసుకుంటు నిర్ణయాలు సరైన విధంగా లేవని అన్నారు. ఈ దేశాన్ని కొంతమంది పెట్టుబడిదారులకు అప్పగించాలని చూస్తున్న వైఖరిని మార్చుకోకపోతే మీకు కూడా అదే గతి పడుతుందని అన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కార్యదర్శి బి. కిషన్ సబ్ డివిజన్ నాయకులు మాచర్ల రాజన్న, తలారి గంగాధర్, లక్ష్మక్క, పద్మక్క అమీనాపూర్ రమేష్, అనిల్ కుమార్, పార్టీ నాయకులు బట్టు రవి, అరవింద్, తూర్పాటి శ్రీనివాస్, నజీర్, మమత, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

31న జరిగే ర్యాలీని జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఏడవ మహాసభల సందర్భంగా ఈనెల 31న హైదరాబాదులో జరిగే ర్యాలీ సభను జయప్రదం చేయాలని డివిజన్ నాయకులు మహమ్మదీ, పరానా మహిళలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని మామిడిపల్లి శ్రామిక నగర్ లో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను ఆపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఢిల్లీలో మహిళా మల్లయోధులపై బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ లైంగికంగా వేధించిన బిజెపి సర్కార్ ఎలాంటి చర్య తీసుకోకపోవడం దుర్మార్గమని వారన్నారు. ఎన్నికల్లో మోడీ, రేవంత్ రెడ్డి పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రేషన్ కార్డుల హామీలను అమలు చేయాలని వారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సభకు మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ అధ్యక్షత వహించగా ఐఎఫ్‌టియు జాతి అధ్యక్షులు డాక్టర్ అపర్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. హైకోర్టు న్యాయవాది కల్పనా కన్నాభిరామన్, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరపల్లి సుజాత హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో మహమ్మదీ, హైమది, భాను, సుల్తానా, రాజమణి, గంగు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌లలో

క్రిమిలేయర్ విధానం అమలు చేయాలి

- దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నెర సిద్ధార్థ

నవతెలంగాణ-కామారెడ్డి

ఎస్సీ క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నెర సిద్ధార్థ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దళిత వికాస్ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు అదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు పాదయాత్ర చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు గత 70 సంవత్సరాలుగా కొన్ని కుటుంబాలు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో అనుభవిస్తున్న వారి పిల్లలే అందవిస్తున్నాయన్నారు. ఎస్సీలలో మూడు శాతం మంది మాత్రమే సంపన్న వర్గంగా ఎదిగారన్నారు. వీరి కుటుంబాలే మళ్లీ మళ్లీ రిజర్వేషన్లు ఫలాలు పొందుతున్నారన్నారు. వీరందరికీ ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపజేయకుండ ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని భారత ప్రధాని నరేంద్ర మోడీని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సింగం కాశీరాం, మెదక్ జిల్లా అధ్యక్షుడు దోమ నాగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంపల్లి రవి, జిల్లా ఉపాధ్యక్షులు ప్యాట్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలుకు 30న చలో ఎస్‌పీడీ ఆఫీస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్, వర్కర్లకు బేసిక్ పే అమలు కోసం, ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టీ.యు) ఆధ్వర్యంలో ఈనెల 30న జరిగే చలో ఎస్.పీ.డీ , (హైదరాబాద్) కార్యాలయం పిలుపును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. బుధవారం మోపాల్ కేజీబీవీ వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్, వర్కంర్లకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కాలేజీలుగా అప్ గ్రేడ్ ఐన కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలన్నారు. రిటర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. వంట పాత్రలు ఇతర సామాగ్రిని సరిపడా కొత్తవి అందించాలన్నారు. డ్యూటీచార్ట్ అమలుచేసి, పనిభారం తగ్గించాలన్నారు. కంప్యూటర్ ఒకేషనల్ ఇన్స్ స్ట్రక్టర్లకు ఫుల్ టైం వేతనాలు ఇవ్వాలన్నారు. ఏఎన్ఎం లకు నైట్ డ్యూటీలు తగ్గించాలన్నారు. నాన్ టీచింగ్ సిబ్బందికి బదిలీలు చేపట్టాలన్నారు. గత, ప్రస్తుత ముఖ్యమంత్రులు ఇచ్చిన హామీ మేరకు నాన్ టీచింగ్, వర్కర్లను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 30న చలో ఎస్‌పిడి (హైదరాబాద్) ఆఫీస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని కేజీబీవీ, యుఆర్ఎస్, మోడల్ స్కూల్ నాన్ టీచింగ్ వర్కర్లు ఈ పిలుపును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది సుమలత, లక్ష్మి పుష్పలత, ప్రేమ, వాసుకి, సంతోషి, సుజాత, సరోజ, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలువురు

జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఎంపిక







నవతెలంగాణ- నిజామాబాద్ సిటీ

ఈనెల 28 నుండి వచ్చేనెల 4వ వరకు గచ్చిబౌలి స్టేడియం హైదరాబాదులో జరగబోయే జాతీయస్థాయి జూనియర్ మెన్ హాకీ కోచింగ్ క్యాంపుకు మన జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు అగ్గు మనోజ్, రాసబోయిన సృజన్, బానోత్ నితిన్ ఎంపిక అయ్యారని నిజామాబాద్ జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ తెలియజేశారు. వీరి ఎంపిక పట్ల నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి మాట్లాడుతూ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, నిజామాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోశాధికారి పింజ సురేందర్ , వైస్ ప్రెసిడెంట్ విద్య సాగర్ రెడ్డి, రిటైర్డు హాకీ కోచ్ హర్షవర్ధన్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజు సంయుక్త కార్యదర్శులు ఎండి జావిద్, ఎండి ఆరిఫ్, చిన్నయ్య ఈసీ మెంబర్స్, సీనియర్ హాకీ క్రీడాకారులు వీరిని అభినందించారు.

విషజ్వరాలకు తక్షణమే చికిత్సలు అందించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో విస్తరిస్తున్న విషజ్వరాలు డెంగ్యూ వంటి వాటికి అవసరమైన చికిత్స లు ప్రభుత్వం తక్షణమే అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మలేరియా, డెంగ్యూ టైఫాయిడ్, చికున్‌గున్యాతో పాటు, విషజ్వరాల పెరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో కుటుంబాలకు కుటుంబాలే మంచానపడుతున్నాయని, గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. పంచాయితీల్లో సరిపడా వర్కర్స్ లేక పోవడం వల్ల పారిశుధ్యం లోపించడం వల్ల పరిస్థితి ఇంకా తీవ్రంగా మారిందని తెలిపారు. 10 రోజుల నుండి పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం సీజనల్ వ్యాధులపై తాత్కాలిక ఉపశమన చర్యలు తీసుకోవడం తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదని పేర్కొన్నారు. అధికారికంగా నమోదైన కేసుల సంఖ్య కంటే వాస్తవంగా చాలా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. డెంగ్యూ, విషజ్వరాల వల్ల అక్కడక్కడా మరణాలు సంభవిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైనన్ని మందులు, బెడ్లు, డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, వైద్య పరికరాలు లేవు. హాస్పటల్స్ రోగులతో నిండిపోతున్నాయి. చాలా చోట్ల ప్లేట్లెట్లు నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. దీంతో పేద, మధ్య తరగతి రోగులు ప్రయివేటు హాస్పిటల్స్ ఆశ్రయిస్తున్నారు. అవసరంలేని వైద్య పరీక్షలు, బెడ్చార్జీలు, ఇతర ఛార్జీల పేరుతో రోగులను దోపిడీకి గురిచేస్తున్నారు.

ప్రజారోగ్యం క్షీణిస్తున్న ప్రస్తుత తరుణంలో తక్షణమే అన్ని గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, గూడేల్లో మొబైల్ టీమ్ల ద్వారా వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సహాయం అందించాలన్నారు. అవసరమైతే సంచార వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించాలనీ, గిరిజన ప్రాంతాల్లో దోమతెరలను పంపిణీ చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకుని జిల్లా సెంటర్ల లో ప్లేట్లెట్స్ కౌంట్ మిషన్స్ తో పాటు, హెల్త్ చెకప్, ఇతర వైద్య పరీక్షల పరికరాలు, మందులు, డాక్టర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్తో పాటు, ఇతర స్టాప్ సమకూర్చాలి. వీటితో పాటు, ఎమర్జెన్సీ పరికరాలను అందుబాటులో ఉంచాలని సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్ ను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నదన్నారు.

30న టీయూలో కెమిస్ట్రీ విభాగంలో జాబ్‌మేళా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీ లో 2022,2023 మరియు 2024 విద్యా సంవత్సరంలో పీజీ. పూర్తైన విద్యార్థులకు ఈ నెల 30 న తెలంగాణ యూనివర్సిటీ, కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో హేటరో డ్రగ్, వారి ప్లేస్మెంట్ డ్రైవ్‌ను కంప్యూటర్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారని కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు అడికే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, జెనెటిక్స్, బి ఎస్‌సి లైఫ్ సైన్సెస్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ ప్లేస్ మెంట్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నూతన ఓటరు జాబితా తయారీకి

రాజకీయ పార్టీలు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆసీస్ సంగ్వాన్



హనుమండ్లును సన్మానిస్తున్న కలెక్టర్

- జిల్లా కలెక్టర్ ఆసీస్ సంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

నూతన ఓటర్ జాబితా తయారుకి రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆసీస్ సంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి నూతన ఓటర్ జాబితా తయారు 2025 పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ జాబితా నమోదు అనేది నియంత్ర ప్రక్రియ అని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి సర్వే చేసి చనిపోయిన ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ఇతర ప్రాంతాల నుంచి షిఫ్ట్ అయిన వారి పేర్లను జాబితాలో చేర్చడం, ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన వారి పేర్లను తొలగించడం 1 జనవరి 2025 వరకు 18 సంవత్సరాల వయసు నిండినవారిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఓటర్ జాబితాను తయారు చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ రెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, ఆర్డీవోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కిరణ్, మహమ్మద్ సర్వర్, బిజెపి పార్టీ నుండి వేణు, సంతోష్ రెడ్డి, ఏఐఎంఐఎం జఫర్ ఖాన్, టిడిపి కసిమాలి, బీఎస్పీ హరిలాల్, ఆమ్ ఆద్మీ పార్టీ లాల్ భాష తదితరులు పాల్గొన్నారు.

వన ప్రేమికుడిని సన్మానించిన కలెక్టర్..

బాన్సువాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడైన పిచ్చుకనుమడ్లు వన ప్రేమికుడిగా గుర్తించి ఆయనను అభినందిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో ఆయనను సన్మానించారు. పిచ్చుక హనుమండ్లు (విశ్రాంత ఉపాధ్యాయులు) బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న అతను తన స్వంత ఇంటి ఆవరణలో ప్రస్తుతం 300 మొక్కలు పెంచి వాటిని సంరక్షణ చేసినందుకు,

50 సంవత్సరాలుగా తాను బోధించిన ప్రతి పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించి సంరక్షించేలా చేసినందుకుగాను ఆయన కృషిని అభినందిస్తూ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ హనుమాన్లు ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం. సురేందర్ పాల్గొన్నారు.